**శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi**

నవంబర్ 2020 | November 2020


ఈ సంచికలో ... | IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 76వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 10 |
| **3.** | **స్వయం నిబద్ధత** | డా॥ వి. రామదాస్ మూర్తి | 15 |
| **4.** | **శ్రీరమణ మహర్షి భక్తాగ్రేసరులు** | గ్రిద్దలూరు కృష్ణ మూర్తి | 23 |
| 5. | Money, Work and Happiness | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Kavyakantha's Ramana Chatvarimsat | V. Krithivasan | 40 |
| 6. | Prapatti Astakam | V. Krithivasan & Sneha Choudhury | 43 |
| 8. | Lest We Forget Sri G.V. Narasimha Rao | G. Sri Hari Rao | 46 |


## Events in Sri Ramana Kendram in November 2020

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 6th November - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.
4. 29th November - Kartigai Deepam
5. 4th December - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.

(Devotees may please note that due to Social distancing, satsangs are being held online. For details please contact Kendram Office)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# విమర్శకు తావులేదు

డా॥ కే.యస్. గారి 76వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మనం ఏదైనా ఒక రంగంలో నిపుణులమైనప్పుడు, మనల్ని గుర్తిస్తారు, మనకు పేరు, ప్రఖ్యాతులు, హోదా, వస్తాయి, ధనమూ సంపాదించుకోవచ్చు. తెలిసో, తెలియకో, మనం సాధించిన దాని గురించి మనకు గర్వం ఏర్పడుతుంది. ఎంతో తెలుసునని అనుకోవడం మొదలు పెడతాం. ఆధ్యాత్మిక జీవితంలో, మనం సాధన చేసినప్పుడు, అది ఎలాంటి సాధనైనా సరే, మనకు ఏమీ తెలియదని గుర్తిస్తాము. ప్రతి విషయమూ, ఏ కొద్దిగా మాత్రమే తెలుసునని మనకు ఆశ్చర్యం వేస్తుంది. మనకు ఎంతో తెలియదన్న సంగతి మాత్రం మనకు తెలుస్తుంది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క విషయాన్ని గురించి పరిపూర్ణమైన జ్ఞానం తెలియదన్న విషయాన్ని గుర్తిస్తాము. అది ఎలా జరుగుతుంది? సాధనలో పురోగతి చెందుతున్న కొద్దీ, దేనినీ పూర్తిగా అవగాహన చేసుకొనలేమని గ్రహిస్తాము, ఎందుకంటే మనల్నే మనం పూర్తిగా అర్థం చేసుకోలేము. అలాంటి పరిస్థితిలో, మనకు బాహ్యంగా వున్న దాన్ని ఏ కొద్దిగానో తప్ప పూర్ణంగా అవగాహన చేసుకొనడం అసాధ్యం. మన విషయ జ్ఞాన పరిమితులు మనకే తెలియవస్తాయి. పరిస్థితులు మన వల్ల కాదు, ఒక ఉన్నత శక్తి వల్ల రూపు దిద్దుకుంటాయన్న సత్యం బోధపడుతుంది.

## నామ రూపాలు ముఖ్యం కాదు

ఆ భగవంతుని చేతిలో మనం పనిముట్లు మాత్రమే. మనం నీటి కుళాయిల వంటి వాళ్ళం. కుళాయి ద్వారా నీళ్ళను పోనివ్వ గలం. లేదా ఆపగలం. కుళాయి పని అంతే. ఆ కుళాయి ఎటువంటి దైనా సరే - ఇత్తడి, వెండి లేదా బంగారుదైనా. తన ద్వారా నీటిని ప్రవహింప జేయడమే దాని పని. మన పరిమిత జ్ఞానం కారణంగా బాహ్య రూపానికి ప్రాధాన్యతనిస్తూ బంగారు కుళాయి ఉత్తమ మైనది అని మనం అనుకోవచ్చు. భగవాన్ పదే పదే, ''రూపానికి ప్రాధాన్యతను ఎందుకిస్తారు? శరీరానికి మాత్రమే ఎందుకు పరిమితం చేసుకుంటారు? నీవు శరీరం కాదు'' అని అనేవారు. మన పరిమితమైన మనసును ఉపయోగించి ఒకటి మంచిది లేదా చెడ్డది అని అంటారని ఆయన అనేవారు. ఈ లోకంలో ప్రతీ దానికీ ఒక స్థానమంటూ వుంటుంది. ఒక పద్ధతి నీకు తృప్తిని ఇస్తే, దాన్ని నీవు అనుసరించు. కాని ఇతరులు అనుసరించే పద్ధతిని విమర్శించి దాన్ని హీనమైనదిగా భావించరాదు. ఈ ప్రపంచం విశాలమైనది. మనం విగ్రహారాధన చేయాలా అని అడిగినప్పుడు ఛలోక్తిగా ''మనమందరమూ విగ్రహారాధన చేయడం లేదా? అందరం విగ్రహాలను పూజిస్తాం. ఎందుకంటే మన శరీరం శాశ్వతమైనది కాదని తెలిసినప్పటికీ, ప్రతి ఒక్కరూ దాన్ని పూజిస్తాం. పూజించడం మొదలుపెట్టినప్పుడు అది విగ్రహమే, కాని కొంత కాలం తరువాత అది ఒక లక్ష్యానికి మార్గం మాత్రమేనని గ్రహిస్తాం. సాధన ద్వారా శ్రీకృష్ణుడు, శ్రీరాముడు మనలోనే వున్నారు, బయట

ఎక్కడో లేరు అని తెలుసుకుంటాం. మన పూర్వీకులు మనలో కొంతమందికి రూపం (ఆకారం) లేని భగవంతునిపై ధ్యాసను కేంద్రీకరించడం సాధ్యం కాదని ఆలోచించారు; అందుకే మన మీద సానుభూతితో విగ్రహారాధనను ప్రవేశపెట్టారు.

శ్రీ లలితా సహస్రనామ పారాయణలో దేవి యొక్క వెయ్యి పేర్లను పఠిస్తూ, చివరకు 'నామ, రూప వివర్జిత - పేరు, ఆకారం లేని దేవత అని చదివి, ముగిస్తాం. ఎన్నో స్తోత్రాలను పూజ్య భావంతో పఠిస్తున్నప్పుడు మనలో ఏమి జరుగుతుంది? ఒక పది, పదిహేను నిమిషాల తరువాత, మనం దేని గురించీ ఆలోచించం. పూజా కార్యక్రమంలో మునిగినప్పుడు, పదినిమిషాల తరువాత, పఠించ వలసినదాన్ని నాలుక తన పాటికి తాను అంటూ పోతుంటే, మనసు మాత్రం అంతకాలం ఏకైక ధ్యాసలో వుండడంతో అప్పడే పూజ అయిపోయిందా అని మనకు ఆశ్చర్యం వేస్తుంది. కాని కొన్ని సమయాలలో మనసు పూజ మీద కేంద్రీకరించకుండ ఇతర విషయాలపై ధ్యాస మరలుస్తుంది. ఇలా రెండు పరిస్థితులూ ఏర్పడే అవకాశం వుంది.

## ధ్యానాన్ని చెదరగొట్టే ఆలోచనలు

ధ్యానం చేస్తున్నప్పుడు పరధ్యానం ఏర్పడితే, దాని గురించి బాధపడనక్కరలేదు. ఈ పరధ్యానం ఎవరికి కలిగింది అన్న ప్రశ్న వేసుకోవాలని భగవాన్ అంటారు. ఏదో కారణం వల్ల పలు ఆలోచనలు ధ్యానం మధ్యలో వస్తాయి, అప్పుడు ఏకాగ్రత దెబ్బ తింటుంది. లోపల వున్నదేదో బయటికి రావడానికి ప్రయత్నిస్తోంది

కనుక దాన్ని అదిమిపెట్టకుండ గమనించమంటారు భగవాన్. గురువు అనుగ్రహం వల్లనే అవి అలాగ బహిర్గతమవుతాయని అంటారు. పలు జన్మల వాసనలు బయట పడుతుంటాయి, అందుకు బాధపడనక్కర లేదు. గురు కృప కలిగినప్పుడు లోని ఆలోచనలు వేగంగా బహిర్గతమౌతాయని ఋషులు, సాధువులు చెబుతారు. అలాగే కొంతసేపు ధ్యానాన్ని పొడిగిస్తే, శాంతి ఎక్కువ కాలం ఏర్పడుతుంది. ఈ విషయంలో మహర్షి జీవితంలో నుండి నేర్చుకొనవలసినది ఎంతో వుంది.

ఎవరైనా భగవాన్ వద్దకు వెళ్ళి ''నేను కృష్ణ భక్తుడిని'' అని చెబితే కృష్ణుని గురించి కొంత చెప్పమని అడిగేవారు. అంతేగాని ''శ్రీకృష్ణునిని ఎందుకు ఆరాధిస్తున్నావు? శివుడిని కొలువు. నేను 'అరుణాచల శివ' అని జపం చేస్తుంటాను. అందుకే నీవూ అలాగే చేయి'' అని ఎప్పుడు చెప్పలేదు. మనమైతే అలాగ చెప్పేవాళ్ళం. కాని భగవాన్ అలాగ ఎప్పుడూ అనలేదు. ఎవరు ఏది సరియైనదని నమ్మినా, ఆయన నిరుత్సాహపరిచేవారు కాదు. ''మన సంగతే మనకు ఏమీ తెలియదు. ఇక రెండు, మూడు పద్ధతులను లేదా ఇద్దరు వ్యక్తులను ఎలా పోల్చగలం. ఒకరు ఎక్కువని, మరొకరు తక్కువని ఎలా అనగలం?'' అనేవారు. మన అహం వల్లనే ఇలాంటి తారతమ్యాలను చూపే ప్రయత్నాలను చేస్తాం అని ఎవరితోనో అన్నారు. ''నా గురువు నీ గురువు కంటే గొప్పవాడు'' అని అహం చెబుతుంది. ఇలాగ తారతమ్యాలను ఎత్తిచూపడం వల్ల గురువుకు ఏ నష్టమూ వుండదు. ఉన్నతస్థాయిలో వున్న మహాత్ములను సరిపోలిస్తే నష్టపోయేది మనమే.

## తారతమ్య చర్చ పనికి రాదు

ఒకసారి కుంజుస్వామి భగవాన్ సమ్మతిని తీసుకుని మరొక స్వామీజీని దర్శించడానికి వెళ్ళాడు. తిరిగి వచ్చాక అక్కడ చాలామంది స్వామీజీకి ఫలాలను సమర్పించి సాష్టాంగ ప్రణామాలు చేశారని భగవాన్‌తో చెప్పారు. ఆయన ''నీవేమి చేశావు'' అని కుంజుస్వామిని అడిగారు. ''నేనేమీ చేయలేదు. అలా ప్రణమిల్ల లేదు'' అని కుంజుస్వామి బదులిచ్చాడు. అందుకు మహర్షి అది నీ అహం వల్ల జరిగింది. అంతకంటే గొప్ప గురువును నీవు అనుసరిస్తున్నావని అనుకోవాలని అలా చేశావు. మరొక గురువు వద్దకు వెళ్ళినప్పుడు ఆయనకు ప్రణమిల్లడానికి ఏమిటి కష్టం? ప్రతి ఒక్కరు దైవికమైనవారని అంగీకరించినప్పుడు ఇలాంటి తారతమ్యాలను చూపడం అవసరమా? వేరొక వ్యక్తికి ప్రణమిల్లు తున్నప్పుడు నీ స్వంత గురువును తలచుకొని, ఆయనకు నమస్కరిస్తున్నానని భావించాలి''. ఇది అందరమూ గ్రహించాల్సిన విషయం. ఇతర గురువులు, గురువులు కాదని అనుకుంటే, అది వారిపై ప్రభావం చూపదు. అది మన మీద ప్రతిఫలిస్తుంది. మన విషయమే మనకు సరిగా తెలియనప్పుడు ఇతర గురువుల గురించి మనం ఏమి చెప్పగలం? వాళ్ళను గురించి మాట్లాడడానికి మన మెవరు?

అరోబిందో ఆశ్రమానికి వెళ్ళనా అని ఎవరైనా అడిగితే ''వెళ్ళండి'' అన్నారు. ఎవరైనా హిమాలయాలకు వెళ్తామంటే ''వెళ్ళండి'' అని కాశీకి వెళ్తామంటే, ''వెళ్ళండి'' అని అనేవారు. అదే మనమైతే, కోపగించుకుని, నేనిక్కడున్నప్పుడు, ఇతర గురువుల

దగ్గరికి ఎందుకు వెళ్తారు" అని అడిగి వుండేవాళ్ళం. మన అనుభవం పరిమితమైనది గనుక మన గురువే గొప్పవారని భావిస్తాం. ఫలానాది ఏదో చేయమని భగవాన్ ఎవరినీ బలవంతపెట్టేవారు కాదు. వాళ్ళకు ఇష్టం వచ్చిన దానిని చేయనిచ్చేవారు.

ఉదాహరణకు భగవాన్ పాదరక్షలు తొడుక్కొనే వారు కాదు. కాని ఇతరులను "నేను తొడుక్కోను గనుక మీరూ వేసుకోకండి" అని ఎప్పుడూ అనలేదు. రోజులో నాలుగైదు సార్లు కొంచెం కొంచెం నడిచేవారు. కుంజుస్వామిని, ఇతర పరిచారకులను వేడిగా వుంటుందని ముందు నడిచి వెళ్ళమనేవారు. శరీర స్పృహ అసలు లేని భగవాన్ వెన్నెలలో నడిచినట్లు నెమ్మదిగా నడిచేవారు. ఎవరినీ ఏ పనినీ చేయమని ఆయన ఎప్పుడూ కోరేవారు కాదు. వారి జీవితం నుంచి నేర్చుకోవలసిన వాటిలో ఇదొకటి.

## సాధన ప్రథమ కర్తవ్యం

ఎవరైనా చాలా రోజుల తరువాత ఆశ్రమానికి వస్తే భగవాన్ చిరునవ్వు నవ్వేవారు. ఇంత కాలం నుండి ఎందుకు రాలేదని ఎవరినీ అడిగేవారు కాదు. ఇతరుల గురించి ఎవరైనా విమర్శిస్తే దాన్ని ఆపేవారు. "మన పని మనం చేసుకుందాం విమర్శ అసందర్భమైనది" అనేవారు. కొందరు భగవాన్ దగ్గరికి వెళ్ళి "ఆశ్రమాన్ని చక్కగా చూసుకొనడం లేదు. కొన్నిటిని మెరుగుపరచ వచ్చునని ఫిర్యాదు చేస్తే, ఒకటి రెండుసార్లు గమనించి, "మీరు ఇక్కడికి దేని కోసం వచ్చారు? సాధన కోసం. మీ సాధన మీరు చేసుకోండి. ఆశ్రమాన్ని మెరుగుపరచడం కోసం మీరు వచ్చి వుంటే, అలా చేయవచ్చు. అందు కోసమా మీరిక్కడికి వచ్చింది. దాని

కోసం వేరేవాళ్ళు వున్నారు. అవి వాళ్ళకు వదిలెయ్యండి'' అనేవారు. కొందరు మహర్షితో, ''భగవాన్, ఫలానా అతను మంచి వ్యక్తి కాదు. అతడిని ఆశ్రమం నుండి పంపించి వేయాలి'' అన్నప్పుడు భగవాన్ ''ఆయన ఎలాంటివాడో చెప్పడానికి మీరెవ్వరు'' అని ఎదురు ప్రశ్న వేశారు. ''ప్రతి ఒక్కరికి వారి వారి బలహీనతలు వుంటాయి. ఆయన పాటికి ఆయనను వదిలెయ్యండి'' అన్నారు. అంతటితో వదలక ఆ వ్యక్తి ఆశ్రమానికి చెడ్డపేరు తెచ్చాడు గనుక మందలించాలని అన్నాడు. ఒకరు చెబితే అలా చేసే తత్వం భగవాన్‌ది కాదు. ఎందుకంటే మనలాగ ఆయనకు అహం లేదు గనుక తమ పేరు, ప్రఖ్యాతులను పట్టించుకునే ప్రసక్తి లేదు. మనలాగ మనసు కలిగినవారు కాదు ఆయన. జ్ఞాని, అవతార మూర్తి, ఏర్పడే పరిస్థితులకు అప్పటికప్పుడు ప్రతిస్పందించరు.

స్థూలంగా భగవాన్ మనల్ని ధ్యానం చేసుకోమని బోధించారు. అలా ధ్యానం చేస్తున్నప్పుడు బయల్పడే ఆలోచనల్ని గమనించాలి. అలాంటి ఆలోచనల నుండి వేరుపడే ప్రయత్నం చేస్తే, సగం యుద్ధం గెలిచినట్లే. దాన్ని మనం స్వంతంగా సాధించలేమన్నది తెలిసిన విషయమే. ఆయన కృప వల్లే అది సాధ్యమౌతుంది. ప్రతి ఒక్కరికీ వారివారి ఆధ్యాత్మిక పరిపక్వతకు తగినట్లు గురువు లభిస్తారు. గురువుల మధ్య తారతమ్యతలను బేరీజు వేయడం చేయరాని పని. ఉన్నత స్థాయికి చేరినప్పుడు, అసలు గురువు, శిష్యులంటూ వుండరని, ఇతరులను తనలో, తనను ఇతరులలో దర్శించగలుగుతాడు. అప్పుడు అన్వేషి, అన్వేషింపబడే వ్యక్తి ఒకరే అవుతారు.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

**అనువాదం: జి. శ్రీహరిరావు**

శ్రీ భగవాన్‌ను మళ్ళీ స్కందాశ్రమంలో దర్శించుకున్నానేమో కానీ, నేను ఖచ్చితంగా చెప్పలేను. ఆ తరువాత, నేనెంత ప్రయత్నించినా కానీ, కొంతకాలం పాటు శ్రీ భగవాన్‌ను దర్శించుకోలేక పోయాను. అది 1918-1922 మధ్యలో అయి వుండవచ్చును. 1920లో, నేను ఒకసారి శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. ప్రయాణానికి మూడు రోజులు కూడా కేటాయించుకున్నాను. అంతా సవ్యంగానే కనిపించింది. కానీ బయలుదేరే ముందురోజు రాత్రి నుండీ నాకు వెక్కిళ్ళు మొదలయ్యాయి. మూడు రోజుల దాకా తగ్గ లేదు. అప్పుడనిపించింది. బహుశా యేదో కారణం వల్ల - నాలో యేదో పొరపాటు వల్ల శ్రీ భగవాన్ తన దగ్గరకు రాకుండా చేశారేమో అనిపించింది. నా తప్పిదములన్నీ మన్నించాలని శ్రీ భగవాన్‌ను మనస్సులోనే ప్రార్థించుకున్నాను. దాని ఫలితమే కాబోలు, 1922 చివరలో శ్రీ భగవాన్‌ను దర్శించడం వీలయింది. అప్పటికి శ్రీ భగవాన్ తల్లిగారు సమాధి పొందారు. స్వామి, కొండ కిందకు, తన తల్లి సమాధి వద్దకు ప్రస్తుత శ్రీ రమణాశ్రమ ప్రాంగణం వద్దకు దిగి వచ్చేశారు. నేనచ్చటకు ఒకరోజు సాయంకాలం చేరాను. సమాధి ఒక చిన్న పాకలో వున్నది. ప్రస్తుత శ్రీమాతృభూతేశ్వరాలయం అక్కడే నిర్మింప

బడింది. సమాధికి ఉత్తరంగా ఒక గట్టు మీద శ్రీ భగవాన్ కూర్చోవడం గానీ, పడుకోవడం గానీ చేసేవారు. సమాధిని ఆనుకొని తూర్పు దిశలో, ఒక పెద్ద పాక నిర్మింపబడింది. అందులో శ్రీ భగవాన్ పరిచారకులూ, ఆశ్రమానికి సందర్శనార్థము వచ్చు భక్తులూ వుండేవారు. నేను వచ్చిన వెంటనే భారీగా వర్షాలు పడసాగాయి. అప్పుడు ఆశ్రమంలో వున్న శ్రీరామస్వామి పిళ్ళై, తిరుప్పగళ్ నుండీ యితర ఆధ్యాత్మిక గ్రంథాల నుండీ పాటలు పాడసాగారు. ఆయన పాటల ధ్వని, బయటి వాన రొదను కూడా మించిపోయింది. భోజన సమయం కాగానే, నన్ను కూడా పిలిచారు. నా జీర్ణశక్తి బలహీనంగా వుండటం వల్ల, రాత్రిపూట చపాతీలు తినమని సలహా యిచ్చారు. అందువల్ల నాతో కొన్ని చపాతీలు తెచ్చుకున్నాను. కానీ, వాళ్ళందరి మధ్యకు చపాతీలు తీసుకు వెళ్ళడం అసందర్భమనిపించి, ఆశ్రమ భోజనమే తీసుకుందామని వెళ్ళాను. మేమందరమూ కూర్చున్నాక, శ్రీ భగవాన్ నాతో, నాకు వేరు ఆహారము తీసుకొనుట అలవాటయినట్లైన, అలాగే చేయమన్నారు. నేను చపాతీలు తెచ్చుకున్నాను కానీ, అవంత ముఖ్యము కావని సమాధానమిచ్చాను. భోజనానంతరం, నేను సమాధికి దక్షిణ దిక్కున పడుకున్నాను. శ్రీ భగవాన్ గట్టుమీద విశ్రమించారు. సమాధికి ఉత్తరాన. ఆ సారి శ్రీ భగవాన్‌తో యింకొక రోజు గడిపినట్లుగా గుర్తు. వేరు విశేషాలేమీ నాకు జ్ఞాపకం లేవు.

ఆ తరువాత, పరిస్థితులనుకూలించినప్పుడూ, నాకు వెళ్ళాలని పించినప్పుడల్లా శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళేవాడిని. అయితే తరచూ

వెళ్ళడం సాధ్యమయ్యేది కాదు. ఈ సందర్శన విశేషాలు నాకేమీ గుర్తు లేవు కానీ ఒక్కసారి మాత్రం శ్రీ భగవాన్‌ను ఒక ప్రశ్న వేశాను. అందరి వలెనే నేనూ గుడులకు వెళతాను కానీ, నాకు పెద్దగా వెళ్ళాలనిపించదు. దీన్ని గురించి యేమి చేయాలని అడిగాను. శ్రీ భగవాన్ సమాధానమిస్తూ యిలా అన్నారు: ''దానికేమి ఫరవాలేదు. భగవంతుడు మీ హృదయంలోనే వున్నాడని భావించి ఆయనను ధ్యానించండి, సరిపోతుంది''. ఆధ్యాత్మిక కేంద్రమైన హృదయం కుడివైపు వుంటుందని శ్రీభగవాన్ అప్పుడు అనలేదు. కానీ వారి ఉద్దేశ్యమదేనని యిప్పుడు గ్రహించుకున్నాను. దైహికమైన హృదయం ఎడమ వైపు వుంటుంది.

శ్రీ భగవాన్ దగ్గరకు యిలా అప్పుడప్పుడూ వెళ్ళడం జరుగుతూనే వుంది. 1918 నుండీ 1922 వరకూ యీ దర్శనానికి యెటువంటి ఆటంకమూ కలగలేదు. కానీ ఆశ్రమానికి యీ నా ప్రయాణాలు బహుకొద్ది అనే చెప్పవచ్చును. ఆ రోజులలో నా వయస్సు చిన్నది. సంపాదన బాగా వుండేది. ప్రాపంచిక ఆకర్షణలకు మనస్సు లొంగి పోయేది కానీ ఆత్మావలోకనం వైపు దృష్టి పోయేది ఆ సందర్భములలో జరిగిన విశేషాలన్నీ నాకు గుర్తు లేవు. నా మస్తిష్కంలో నాటుకుపోయిన కొన్ని సంఘటనలను తెలియపరుస్తాను. వీటన్నిటిలోనూ శ్రీ భగవాన్‌కు సంబంధించిన యేదో ఒక అనుభవం ముడిపడి వుంది.

1923లోనో 24లోనో ఒకసారి ఆశ్రమానికి వెళ్ళాను. ఆ రోజుల్లో మా పెద్దమ్మాయి వివాహము గురించి నాకు చాలా ఆదుర్దాగా

వుండేది. ఆమెకప్పుడు 15-16 సంవత్సరాల వయస్సు. నేను శ్రీ భగవాన్ సన్నిధిలో పాత ధ్యానమందిరంలో కూర్చొని వున్నాను. మధ్యాహ్నం మూడు గంటలయ్యింది. ఒక భక్తుడు శ్రీ భగవాన్ కోసం యేదో ఆహార పదార్థం తెచ్చారు. ఆనవాయితీ ప్రకారం శ్రీ భగవాన్ కొద్దిగా తీసుకున్న తరువాత, మిగిలినది భక్తులకు పంచి పెట్టారు. ఆ సమయానికి హాలులో రెండు కుక్కలున్నవి. ప్రసాదం పళ్ళెం వెళ్ళిన చోటుకంతా ఒక కుక్క పళ్ళెంతో బాటు వెళ్ళింది. రెండవ కుక్క తను కూర్చున్న చోటునే ప్రశాంతంగా ఓపికగా కూర్చొని వున్నది. శ్రీ భగవాన్ ఆ రెండవ కుక్కను ఉద్దేశిస్తూ, ''తన వాటా తనకు వస్తుందని అతనికి తెలుసు'', అన్నారు. ఈ మాట వినగానే, ''మీ అమ్మాయి పెళ్ళి గురించి ఎందుకు చింతిస్తావు? ఆ అమ్మాయికి నిర్దేశించబడినట్లుగా జరిగి తీరుతుంది'', అని వారు నాకు చెప్పినట్లుగా భావన కలిగింది.

శ్రీ భగవాన్ తనను నమ్ముకున్న భక్తులకు బోధించు తీరు యిదే. చాలా కాలం తరువాత శ్రీ భగవాన్ పాత శిష్యులయిన శ్రీ శివ ప్రకాశం పిళ్ళైగారు రాసిన ఒక పాట నాకంట పడింది. ఆ పాటలో, ఆయన శ్రీ భగవాన్‌తో యిలా అంటారు: ''నా కొక చెడ్డ అలవాటు వుండేది. అది తప్పించడానికి మీరు, మీ దగ్గరకు మానవ మాలిన్యము నిండిన నీటితో వచ్చిన ఒక కుక్కతో యిలా అన్నారు: ఈ అలవాటును మానుకో. లేకపోతే నా దగ్గరకు రాకు''. ఆ మాట, ఆ సంబంధిత వ్యక్తికే అర్థమవుతుంది - ఒక ఉపదేశముగానీ లేక ఒక చివాటుగా గానీ! శ్రీ భగవాన్‌కు సన్నిహితులయిన

భక్తులందరికీ, వారి కరుణ, దయ అనుభవించిన వారలందరికీ, యీ విషయము బాగా తెలుసు.

ఈ సందర్భములో నేనొక మాట చెప్పాలి. ఆ రోజులలో శ్రీ భగవాన్ ఒక జీవన్ముక్తునకు సహజముగా లభ్యమగు శక్తులను గోప్యముగా వుంచుటకు తగు జాగ్రత్త వహించే వారు కాదు. నేనొకసారి శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళినప్పుడు, యిద్దరు, ముగ్గురు వ్యక్తులు వారి దగ్గరకు వచ్చి సాష్టాంగ నమస్కారము చేసి కూర్చున్నారు. నాకు గుర్తున్న వరకూ కారూరు నుంచీ వచ్చామని చెప్పారు. శ్రీ భగవాన్ నా వైపు చూసి, వాళ్ళు కెంపుల వ్యాపారులని అన్నారు. 'వారు యింతకు ముందు శ్రీ భగవాన్‌ను దర్శించుకున్న వారనుకుంటున్నా శ్రీ భగవాన్‌కు చిరపరిచితులయ్యుంటారు', అన్నాను."కాదు, ఆ ప్రాంతము వారు కెంపుల వ్యాపారం చేస్తారు" అన్నారు శ్రీ భగవాన్. నాలాంటి మంద బుద్ధికి కూడ, శ్రీ భగవాన్ యిచ్చిన సమాధానము సరికాదని తెలిసిపోయింది. హాలులో వచ్చిన వారందరి హృదయాలు శ్రీ భగవాన్‌కు తెరిచిన పుస్తకము లాగా స్పష్టముగా కనిపించేవి. ఆయనకు అది తప్పేది కాదు. ఆ శక్తిని బహిర్గతం కాకుండా ఉండటానికి ప్రయత్నించేవారు శ్రీ భగవాన్. మన ఆలోచనలను గ్రహించటానికి ప్రయత్నించక పోయినా, మన ఆధ్యాత్మిక స్థితి వారికి ఒక్క రెప్పపాటులో అర్థమై పోయేది. శ్రీ భగవాన్ సమాధిస్థితులు అవ్వడానికి ఒకటి రెండు సంవత్సరాల ముందు వారే యిలా సెలవిచ్చారు: "నా ముందు ఏమి మాట్లాడినా, యిక్కడకు వాళ్ళు యెందుకు వచ్చారో, వారిని చూడగానే నాకు అర్థమైపోతుంది". ఈ విషయం శ్రీమతి నాగమ్మ గారి లేఖలలో పొందుపరచబడి వున్నది. *(సశేషం)*

# స్వయం నిబద్ధత

(మౌంటెన్‌పాత్, జనవరి-మార్చ్, 2017 (సంపుటి-54, సంచిక-1)లో ''రెస్ట్రెయింట్'' అన్న శీర్షికతో ప్రచురింపబడిన సంపాదకీయం యొక్క స్వేచ్ఛానువాదం)

**- డా. వి. రామదాస్ మూర్తి**

## మితంగా వ్యవహరించడం మంచిది

స్వచ్ఛందంగా అదుపులో వుండడమన్నది ఈ రోజుల్లో అంత తఱచుగా వినబడే పదం కాదు. ప్రతి విషయంలోను అతిగా ప్రవర్తించడం, హద్దుమీరడం, పరిపాటి అయిపోయింది. స్వయంగా నిబద్ధతను పాటించడం అంటే బాహ్యంగా అదుపు చేయబడడం కాదు. ఇష్టపూర్వకంగా, ఇతరుల నిబంధనల వల్ల కాకుండ మితంగా వ్యవహరించడం. మన చర్యలు మరింత మెరుగ్గా వుండడానికి అప్పుడు వీలవుతుందన్న ఆలోచన వచ్చినప్పుడు స్వయం నిబద్ధత రంగంలోనికి వస్తుంది. ఉదాహరణకు, ఏవో అంత ముఖ్యం కాని వస్తువుల కోసం అమితంగా ఖర్చు చేయకుండ ధనాన్ని పుణ్యక్షేత్రాల సందర్శనం, అరుణాచల యాత్ర మొదలైన ఉపయోగకరమైన ప్రయోజనలాకు ఖర్చు పెట్టడం, మొదలైనవి. అంటే మన చర్యలకు ప్రాధాన్యత చూపడన్నమాట.

నిబద్ధత అన్నప్పుడు ఎవరో మనకు చెందాల్సినది ఏదో లేకుండ చేస్తున్నాడన్న అర్థం సహజంగా తోస్తుంది. కాని ఆలోచిస్తే మనం పోగొట్టుకుంటామనుకుంటున్నది ఏమిటి? చాలా మటుకు అవి అవసరం లేనివి అయి వుంటాయి. అది ఆహార, వ్యవహార

విషయం, లేదా ఇతరమైనవి కావచ్చు. మొత్తం మీద అవి అన్నీ అత్యాశ ఫలితమే. ప్రస్తుతం మన చుట్టూ అశేషంగా తయారవుతున్న ప్రకటనలు, సాంఘికపరంగా ఇతిర ఒత్తిడుల మధ్య నలుగుతూ, అసలైన నమ్మకాలు, విలువలను ప్రక్కకు నెట్టి, అక్కడ లేని వాటిని కోరుకుంటున్నామని ఎలా తెలుస్తుంది? ఎప్పుడు, ఏ సందర్భంలో, మనల్ని మనం ఎలా నియంత్రించుకోవాలన్నది అప్పుడప్పుడు చిక్కు ప్రశ్నగా మిగులుతుంది. ఏ విషయంలోనైనా సరే ఒక విధంగా నడుచుకోవాలనే ప్రయత్నాలను తట్టుకొనడం కష్టమే. ఎందుకంటే, మనసును ప్రలోభపరిచే ప్రేరేపణ ఒక శక్తిమంతమైన మైకము. ఇక మనకు ఉపయోగపడవని తెలిసినప్పటికి, చిరకాలంగా పాతుకు పోయిన అలవాట్లను వదలించుకోవడం ఎలాగ?

**విచక్షణను పాటించాలి**

థాయ్‌లాండ్‌లో తేరవాడ వర్గానికి చెందిన ఆజన్ చాహ్ అనే ఒక సన్యాసి ధ్యానం గురించి చాలా పరిశోధనలు చేశాడు. సన్యాసి ఎలా నడుచుకోవాలన్న సూత్రాలను గురించి ఎన్నో బౌద్ధ గ్రంథాలను చదివాడు. ఒక దశలో దిక్కుతోచక అయోమయంలో పడ్డాడు. అప్పుడు మరొక బౌద్ధ సన్యాసి, పూజ్య ఆజన్‌మున్ వద్దకు వెళ్ళి తన సమస్యను విన్నవించుకున్నాడు.

ఆ పెద్ద గురువు "ప్రతి ఒక్క సూత్రాన్ని పరిగణనలోనికి తీసుకుని అనవసరంగా లోతుకుపోతే అదే జరుగుతుంది. మనసుకు తగిన శిక్షణను ఇస్తే మనం జాగ్రత్తగా వుండగలం. కొన్ని

కోరికలతో సంతృప్తి చెందే మనస్తత్వం ఏర్పడుతుంది. అప్పుడు మన స్మృతి ఎక్కువవుతుంది. అనుమానంగా వున్నప్పుడు దాని గురించి ఏ చర్యను తీసుకొనకూడదు. ప్రతి ఒక్క సూత్రాన్ని ఆచరించడం భారవంతమవుతుంది. మన పొరబాట్లను గుర్తించ గల శక్తిని పొందగలగాలి. అలా చేయగలమా? మనం శిక్షణలో ప్రతి ఒక్క సూత్రాన్ని శిక్షణ పొందిన మనసుతో విచారించి, గమనించి, మంచి, చెడుల విచక్షణ జరిపి, అనుమానమున్న దానిని వదిలెయ్యాలి. స్వీయనిబద్ధతను కోల్పోవద్దు" అని బోధించారు.

ఆత్మవిచారం, స్వయం నిబద్ధత, రెండూ ఒకటే. ఎవరు ఆలోచిస్తున్నారు, ఎవరు అనుభవిస్తున్నారు. ఈ "నేను" అన్నది ఎవరు? ఈ ప్రశ్నలు వేసుకున్నప్పుడే, ఏది నిజం, ఏది కాదు, అన్న విచక్షణా ప్రక్రియ మొదలౌతుంది. అనుమానం వున్నచోట ఆగుతాం, సరియైన స్పందన వచ్చేవరకు ఏ చర్యనూ తీసుకోము. నిత్య జీవితంలో మనం ఎల్లప్పుడూ, భ్రమ, తబ్బిబ్బులకు లోనవుతూ వుంటాం. కారణం, మనమెవరు అన్న విషయాన్ని తప్పుగా అర్థం చేసుకుంటాం. ఆత్మ విచారణ ప్రక్రియలో లభించే సమయం మనం అప్పటి వరకు ఊహించుకుని, కోరుకుంటున్న విధంగా కాకుండ యథార్థాన్ని చూడగలిగే అవకాశాన్ని కలుగ జేస్తుంది. ఆ కాస్త ఖాళీ సమయంలో మనసు స్థిరంగా వున్నప్పుడు, భ్రమ వుండదు, కోరికలు తీర్చుకోవాలన్న ఆలోచన వుండదు.

•

శ్రీరామకృష్ణ పరమహంస మనకు ఏది అవసరం, ఏది అసంబద్ధం అన్న దాన్ని తెలియబరిచే ఒక కథ చెప్పారు. ఒక చిన్న పడవ నదిని దాటబోతున్న సమయం. అందులో ఇద్దరే - పడవ నడిపే గ్రామస్థుడు. ఒక పండితుడు - వున్నారు. తన పాండిత్యంతో గర్విష్టి అయిన పండితుడు, చదువుల్లో తన గొప్పతనాన్ని చెప్పుకుంటూ ఆ గ్రామస్థుడితో ఎగతాళిగా మాట్లాడాడు. అదే సమయంలో పెద్ద ఉప్పెన వచ్చి పడవ విపరీతంగా ఊగులాడింది. తన అనుభవం వల్ల పడవ మునగవచ్చునని ఆ గ్రామస్థునికి అర్థమయింది. అతను పండితుడిని మీకు ఈదడం వచ్చునా అని అడిగాడు. పండితుడు ఈత తెలియదన్నప్పుడు గ్రామస్థుడు తనకు వేదాలు తెలియకపోయినప్పటికి, తాను ఈదగలనని చెప్పాడు.

నిత్యజీవితంలో గాభరాలు, అజ్ఞానం లేకుండ వుండడానికి అతి ముఖ్యమైన పనిముట్టు ఏమిటి? ఏది శాశ్వతం, ఏది క్షణ భంగురం అన్న వివేచనను ప్రదర్శించేలాగ మనసుకు శిక్షణ ఇవ్వాలి. ఈదగలిగే శక్తి కలిగివున్నట్లు, భావనలు, సంకల్పనలు అవే సముద్రంలో మునగకుండ కాపాడుకొనవచ్చు. సాధారణ క్రమశిక్షణా సూత్రాలు, సుగుణ, సుశీలతలను అనుసరించడం ద్వారా మనసును సుశిక్షతం చేసుకొనవచ్చు. అనవసర వాదనలు శక్తిని వృథాచేస్తాయి, రోష, ద్వేషాలను కలిగిస్తాయి. ఇతరులతో పోల్చుకొనడం మానుకోవాలి. అందరు తమతమ వేగాలతో, భిన్నమైన అవసరాలతో పయనిస్తుంటాం. అవతలి వారు

ఎదుర్కొంటున్న సవాళ్ళను సరియైన దృష్టితో గుర్తించడానికి సిద్ధంగా వుండాలి. లేకుంటే ఇతరులను విమర్శించి, వారిపై తీర్పులను ఇచ్చే తప్పును చేస్తాం. కాలక్షేపపు మాటలను, ఇతరుల గుర్తింపు పొందాలన్న ఆశను మానుకోవాలి. అలాగ వుండడానికి ఒక మౌలికమైన ప్రవర్తన అవసరం: జీవితంలో వీలైనంతగా వ్యతిరేక ధోరణి లేకుండ జాగ్రత్త పడాలి. శరీరాన్ని, మనసును స్వచ్ఛంగా వుంచుకోవాలి.

## ఆత్మవిచారణ నిబద్ధతకు దోహదకారి

భగవాన్ పదేపదే బోధిస్తూ వచ్చిన ఆత్మవిచారణ మన దృష్టికోణాన్ని నిశితం చేయడానికి పనికివచ్చే శక్తిమంతమైన పనిముట్టు. నియంత్రణ అంటే అది శిక్షగాని, లేదా అదే పనిగా సంతోషాన్ని వ్యతిరేకించే ఒక విపరీతమైన ప్రవర్తనగా గాని పరిగణించరాదు. మనం చేయబోతున్న ఏ ఒక్క చర్య ఫలితాలు ఎలాగ వుండబోవచ్చునన్న అంశాన్ని ముందుగానే విశదపరుస్తుంది. అనుమానం వచ్చినప్పుడు ఆ నియంత్రణను రంగంలోనికి తీసుకు రావాలి. అలాగని, స్పందన లేకుండ నిర్జీవంగా వుండడం మాత్రం కాదు. నిజానికి, దానికి విరుద్ధంగా ఏది చేయదగినది అన్న వివేచన పెరగడానికి పనికి వచ్చేది.

కారును నడపడానికి మొదటిసారి ప్రయత్నించినప్పుడు కారు తనను నడుపుతోందా అన్న అనుమానం వచ్చి భయంతో బ్రేకును తొందరగా నొక్కుతారు. అలవాటు, అయిన తరువాత బ్రేకును

నెమ్మదిగా నొక్కాలని తెలుసుకుని అదుపు చేయడం స్వయంగా నేర్చుకుని కారును తమ అదుపులోనికి తెచ్చుకుంటారు. అలాగే, భగవాన్ మన విషయంలో అవసరమైన 'మందు'ను మనకే తెలియకుండ నేర్పుతో ప్రయోగిస్తారు. ఆ 'చికిత్స' విజయవంతమైన తరువాతనే గతంతో పోల్చుకుని ఎంతగా మారినది తెలుసుకుంటాం. అప్పటిదాకా జ్ఞానహీనంగా అసంకల్పితంగా ప్రదర్శిస్తున్న భయాందోళనలు ఇక తొలగిపోతాయి.

**ధ్యానం**

గౌతమబుద్ధుడు ధ్యానప్రక్రియను ఒక సంగీత వాయిద్యాన్ని శ్రుతి చేయడంతో పోలుస్తాడు. ఆ వాయిద్యాన్ని వాయిస్తున్నప్పుడు, అలాగే మనసును దారిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నప్పుడు కఠినంగా, పరుషంగా ప్రవర్తించాలా, లేదా యథేచ్ఛగా వదలిపెట్టాలా? తీగలున్న వాయిద్యాన్ని శ్రుతిచేసే సమయంలో తీగలను మరీ బిగించాలా లేదా వదులుగా వుంచాలా? రెండూ సరియైనవి కావు. తగినంత బిగువుగా మాత్రమే వుంచాలి. అలాగే ధ్యానం వల్ల, ఖచ్చితమైన నియంత్రణతో, పర్యవసానాల అవగాహన మనకు ఏర్పడుతుంది.

మనసు చంచల స్వభావం కలిగివుంటుంది. ప్రతి ఆలోచన ఉదయించే కొద్దీ దాని వెంబడి ధ్యానం యొక్క దిశను మార్చాల్సి వస్తుంది. కాని భగవాన్ మాత్రం ధ్యానం అలా ముక్కలు ముక్కలుగా కాకుండ తైలధారలా, ఎప్పుడూ ప్రవహించే నీటివాగు

లాగ వుండడం శ్రేష్ఠం అంటారు. ఆత్మవిచారణ యొక్క ఉద్దేశం చైతన్యాన్ని ఎఱుకలోనికి తెచ్చుకుని మన 'గరిమనాభి' చెదరకుండ వుంచుకోవడం అని బోధిస్తారు, సమతుల్యతను నిలపుకోవాలని చెబుతారు.

సాధనా క్రమంలో ప్రతి శ్లోక గ్రంథపఠనం, ప్రతినిబంధన, సూచన, సలహా, హెచ్చరిక, చర్చ, ఆజ్ఞాపనలను మరీ ఖచ్చితంగా పాటించడానికి ప్రయత్నిస్తే, బౌద్ధ సన్యాసి అజాన్ చాహ్ లాగ మనం కూడ భంగపడి, ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయి, అధైర్యపడతాం. ప్రపంచమంతటా, ఇది చెయ్యకు, అది చెయ్యి అన్న నిబంధనలు ఉండనే వుంటాయి. వాటన్నిటిని, 'తు,చ' తప్పకుండ నడుచు కోవాలని ప్రయత్నిస్తే పిచ్చెక్కుతుంది. స్థిరత్వాన్ని కోల్పోయి, నిరాశ, నిస్పృహల అగాధంలోనికి మనసు పడిపోతుంది. ఏకాగ్రతతో కూడిన ఎఱుక చీకటి మార్గంలో వెలుతురును పడనిచ్చి, జాగ్రత్తగా మెలగడంతో సమానం. ఎఱుక బలిష్టమయ్యే కొద్ది, సరియైన చర్య ఏది అన్న గ్రహణ శక్తి పెరుగుతుంది. ఆత్మ విచారణే ఉత్తమమైన మార్గం.

## శరీరం, మనసు

వ్యక్తి యొక్క భౌతిక శరీరము, ఆత్మ, ఒక దానికి ఒకటి పొసగక పోవడం అంటూ ఎలా వుండదో, మనం ఆధ్యాత్మిక ప్రపంచం అనేది, ఈ భౌతిక ప్రపంచమూ పరస్పర వ్యతిరేకమైనవి కావు. అవి గనుక నిజంగా విరుద్ధ స్వభావాలను కలిగివుంటే, గురుకృప

లేని పక్షంలో, వ్యక్తి వ్యతిరేక ప్రేరణల ప్రభావంతో ఛిన్నాభిన్న మవుతారు. యథార్థానికి, మనసు, శరీరం ఒకదానికొకటి దోహద పడేవి. అవి మన ప్రేరణలు, చర్యల ఫలితాలను అవగాహన చేసుకునేందుకు సహాయపడే సాధనాలు.

శాస్త్రాల ప్రకారం, మానవజన్మ లభించడం అతి దుర్లభం. శరీరము, మనసులకు సరియైన క్రమశిక్షణతో, ధర్మం, సన్మార్గాల బాటలో నడవగలిగే శిక్షణను ఇవ్వాల్సి వుంటుంది. ఎంతోమంది జీవితం ఒక చెఱ అని భావించి, ఎంత త్వరగా శరీరాన్ని వదిలించు కుంటే అంత మంచిదనుకుని హింసించుకొనడం మనం గమనిస్తుంటాము. అది వ్యతిరేక ధోరణిలో నడిచే స్వయం నిబద్ధత, చనిపోవాలనే వాంఛకు భిన్నం కాదు. పుట్టుకతో ఈ శరీరాన్ని పొందాము, కొద్దిపాటు ప్రయత్నంతో దానిని తగిన స్థితిలో వుంచు కొనడం భావ్యం కదా!

తొందరపాటు లేకుండ సాధనలో అడుగులు వేయాలన్నది భగవాన్ బోధనల ప్రత్యేక లక్షణం. కాని ఒక అడుగు వేసిన తరువాత తిరిగి, దుష్టబుద్ధి, వాసనల వలలో పడడం వుండదు. మనం ఒక అడుగు గురువు వైపు వేస్తే, వారు తొమ్మిది అడుగులు మనవైపు వేస్తారు. కాని ఆ మొదటి అడుగు వేయడానికి మనం స్వయం నిబద్ధతను లలితంగా పెంపొందించుకుంటే మనసు ప్రశాంతంగా వుండి గురుకృపను పొందడానికి సిద్ధమై వుంటుంది.

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ గ్రిద్దలూరు సాంబశివరావు గారు

## (10.01.1889 - 05.11.1962)

గ్రిద్దలూరు కృష్ణమూర్తి

"... ... ... సంతకం పెట్టుట నా అలవాటు కాదు. కాబట్టి, నా బదులు గ్రిద్దలూరు సాంబశివరావు దీనిలో నా ఎదురుగా సంతకం చేయుటకు అధికారం ఇచ్చుచున్నాను"

- స్వయంగా శ్రీ భగవాన్ 1938 మార్చి నెలలో అన్న మాటలు

÷÷÷

**జననం:**

గ్రిద్దలూరు వారి మూలపురుషులు శ్రీ శివయ్యగారు, శ్రీమతి లక్ష్మమ్మ దంపతులు. వీరి కొడుకు-శ్రీ వేంకట చలమయ్య, కోడలు శ్రీమతి జ్ఞానమ్మ. తొలి కానుపుకు పుట్టింటికి వెడుతూ, మామగారికి నమస్కరించగా, వారు "అమ్మా! నీకు మగపిల్లవాడు పుడతాడు. వాడి బాలసారె నాటికి (11వ రోజుకి) నా నెల మాసికం వస్తుంది. పిల్లవాడికి నామకరణం జరిపించి 'సాంబశివరావు' అని పేరు పెట్టండి. నా మాసికము మరుసటి రోజు జరపండి. మీకందరికి ఒక మహర్షి, మహానుభావుడు అండగా వుండి తరతరాలను కాపాడుతాడు", అని ఆశీర్వదించారు అని పెద్దలు చెప్పారు. సాంబ శివరావుగారికి నలుగురు సోదరులు, ఒక సోదరి. వృత్తిరీత్యా నెల్లూరులో ప్రసిద్ధిపొందిన ప్లీడరు (లాయరు).

## శ్రీ భగవాన్ గ్రిద్దలూరు వారి కుటుంబంలో ప్రవేశించడం:

సాంబశివరావుగారి ద్వితీయ సోదరుడు శ్రీసత్యనారాయణ రావుగారు (నా తండ్రిగారు) వేలూరులో మహంతు పాఠశాలలో అధ్యాపకులుగా చేస్తూ వుండగా, 1922వ సం॥లో శ్రీ ప్రణవానందులు (వీరే శ్రీ సర్వేపల్లి నరసింహయ్యగారు - స్వతంత్ర భారతదేశ ద్వితీయ రాష్ట్రపతిగా చేసిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పినతండ్రి గారు) కృత్తికా దీపోత్సవానికి తిరువణ్ణామలై వెళుతున్నానని, శ్రీ సత్యనారాయణరావుగారిని కూడా రమ్మని తీసుకు వెళ్ళారు.

కృత్తికా దీపోత్సవం అయిన మరుసటిరోజు వీరిరువురూ బ్రాహ్మణ స్వామిని (భగవాన్ శ్రీరమణ మహర్షి) చూడటానికి వెళ్ళారు. ఆ సమయంలో - ఒక రాయి మీద కూర్చుని (ఇప్పుడు శ్రీ భగవాన్ సన్నిధి ఉన్న చోటున (అమ్మ సమాధి పక్కన), తదేక దీక్షతో గిరిని చూస్తున్న స్వామిని చూసి మొదటి దర్శనంలోనే సంపూర్ణ శరణాగతి చెందారు శ్రీ సత్యనారాయణరావుగారు. అలా గ్రిద్దలూరువారి కుటుంబంలోకి శ్రీ భగవాన్ ప్రవేశించారు. పిమ్మట శ్రీ సాంబశివరావుగారు, సోదరులు, సోదరి, నా తల్లిగారు శ్రీ భగవాను భక్తులై, వారి అనుగ్రహానికి పాత్రులైనారు. శ్రీ సాంబశివ రావుగారు నెల్లూరులో లీడింగ్ లాయరుగా ఉంటూనే, ఆశ్రమ ట్రస్టు మెంబర్సులో ఒకరుగా ఉంటూ ఆశ్రమానికి ఎంతో సేవ చేశారు. నెల్లూరులో శ్రీరమణ జయంతిని ఘనంగా జరిపి,

సాయంకాలం పల్లకిలో శ్రీ భగవాన్ ఫోటో పెట్టి, పెట్రోమాక్సు లైట్ల వెలుగులో శ్రీరమణ స్తుతి పాటలు పాడుతూ, భజన చేస్తూ మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటికి తీసుకుని వచ్చేవారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి బియ్యము, పప్పు వగైరా శ్రీ గుఱ్ఱం సుబ్బరామయ్యగారితో కలిసి సేకరించి శ్రీరమణాశ్రమంకి పంపేవారు. ఇద్దరూ ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ జరిగే కార్యక్రమాలలో సేవ చేసేవారు.

**శ్రీ భగవాన్ అనుగ్రహం:**

శ్రీ సాంబశివరావుగారు ఆశ్రమానికి సంబంధించిన వీలునామా (1938లో) (వీలునామా) వ్రాయుటలోను, రిజష్టరు చేయుటలోను ముఖ్యమైన వ్యక్తిగా వ్యవహరించారు. వారు వీలునామాలో సంతకం చేయటానికి శ్రీ భగవానుల అనుగ్రహం పొందిన పుణ్య పురుషుడు. స్వయంగా శ్రీ భగవాన్ ఇలా అన్నారు...

"ఈ వీలునామా అమలుకి చిహ్నంగా గీత (--) గీశాను. సంతకం పెట్టుట నా అలవాటు కాదు. కాబట్టి, నా బదులు గ్రిద్దలూరు సాంబశివరావు దీనిలో నా ఎదురుగా సంతకం చేయుటకు అధికారం ఇచ్చుచున్నాను".

1938వ సం॥లో శ్రీ టి.ఎన్. వెంకటరామన్ గారిని శ్రీ రమణాశ్రమానికి తీసుకురావడంలో శ్రీ సాంబశివరావుగారు శ్రీ యోగి రామయ్యగారు చెట్టియారుగారితో కలిసి కీలక పాత్ర పోషించారు. వెంకటరామన్ గారికి టౌనులో ఇల్లు, వసతి ఏర్పాటు చేసే అండగా

నిలిచారు. ఆశ్రమ కోర్టు వ్యవహారాలలో చురుగ్గా వ్యవహరించి, శ్రీ టి.ఎన్.వి. గారికి ఎంతో చేదోడువాదోడుగా ఉండి, ఎన్నో కీలక కేసులలో సహాయం చేశారు. శ్రీ టి.ఎన్.వి. గారు మమ్ములను కలిసినప్పుడల్లా శ్రీ సాంబశివరావుగారి గురించి గొప్పగా చెప్పేవారు.

శ్రీ సాంబశివరావుగారి తమ్ముడు శ్రీ సత్యనారాయణరావు గారు భగవానుల పాదాల చెంత 1939 ఫిబ్రవరిలో శరీరం వదిలే సమయంలో, సాంబశివరావుగారు శ్రీభగవానుల సమక్షంలో, తమ్ముడి భార్యాపిల్లలను తాను జీవించి ఉన్నంతవరకు ఏ లోటూ రానివ్వను అని - ఇచ్చిన మాట ప్రకారం, వారి పిల్లల కంటే తమ్ముడి పిల్లలను ఎంతో ప్రేమతో చూచి, చదివించి, ఉపనయనం, పెళ్ళిళ్ళు చేసి, పురుళ్ళు పోయించి ఏ విధమైన లోటు లేకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న శ్రీరమణానుగ్రహశాలి. నెల్లూరులో గ్రిద్దలూరు వారింట్లో ఏ శుభకార్యం జరిగినా శ్రీ భగవానుల చెల్లెలు అలమేలమ్మ అత్త, భర్త పిచ్చు అయ్యర్ మామ, వెంకటరామన్ గారు, నాగలక్ష్మమ్మ గారు, పిల్లలు వచ్చేవారు. ఆశ్రమంలో, శ్రీ టి.ఎన్.వి.గారి ఇంట్లో జరిగే కార్యక్రమాలకు, మా ఇంటి తరపున గ్రిద్దలూరు లక్ష్మీనరసింహారావుగారు, వారి భార్య శ్రీమతి సరస్వతమ్మగారు, సాంబశివరావుగారి చెల్లెలు బిరుదవోలు లక్ష్మమ్మ గారు, భర్త రంగనాథం గారు పాల్గొనేవారు.

శ్రీ చిన్నస్వామి శ్రీ భగవానులను ఏదైనా అడగాలి అంటే స్వామి మీద ఉన్న భయము, భక్తి, గౌరవము వల్ల ఎదురుపడి అడగలేక,

‘‘సాంబశివరావు! వెళ్ళి స్వామిని ఈ పనికి పర్మిషను అడిగిరా!’’ అని వారిని పంపితే, వీరు అడగడానికి వెళ్ళగానే, శ్రీస్వామి ‘‘ఏమి? ఏం కావాలి? చిన్నస్వామి నిన్ను పంపించాడా? సరే.. కానివ్వండి!’’ అని అనేవారట.

1949 సం॥ మార్చి నెల 20వ తేదీ ఉదయాన గ్రిద్దలూరు సాంబశివరావు గారు శ్రీ మాతృభూతేశ్వర సన్నిధి ముఖమండపంలో శ్రీ నిరంజనానంద స్వామికి పాదపూజ చేయాలని సంకల్పించారు. క్రొత్త కాషాయం తెచ్చి, పాదపూజకు కావాల్సిన సామగ్రి సిద్ధపరచి, భగవానుతో మనవి చేసి - శ్రీ భగవాన్ అచటికి దయచేసి యోగా సనాసీనులైన వెనుక తోడి భక్తులతోనూ, బ్రాహ్మణసమితి తోనూ, నిరంజనానందులను బలవంతపరచి తీసుకుని వచ్చి మండపం మధ్యన మేజామీద కూర్చోపెట్టారు. నిరంజనానంద స్వామికి శరీరం కంపించి, ‘‘ఓహో! మీరంతా నన్ను ఏమార్చాలని చూస్తున్నారా? చాలు చాలును మీ భక్తి. నేనీ పూజకు అంగీకరింను. దేహాభిమానం పోయినవారికి పాదపూజ కాని తదితరులకు కాదు. నేను అందుకు అనర్హుడను’’ అంటూ ఆసనం దిగి క్రింద చతికిలబడ్డారు. సాంబశివరావు గారు విడువక బ్రతిమిలాడసాగారు. వీరికా సంకటం. ఈ సందిగ్ధావస్థలో చట్టున ఏదో స్ఫురించినట్లు చిన్నస్వామి ముఖం వికసించింది. గద్గద స్వరంతో, ‘‘మీరిక విడువరు అన్నమాట. అయితే, ఆ లింగం వద్ద భగవాన్ పాదుకలున్నవి. అవి తెచ్చి

పూజించండి'', అని పాఠశాల వటువును చూసి అవి తెమ్మన్నారు నిరంజనానంద స్వామి.

ఒక భక్తుడు ఆ పాదుకలు కుంభాభిషేకానికి ముందే చేయించి వెండి తొడుగు వేసి తెస్తే భగవాన్ పాదాలు ఆనించి ఇచ్చారు. అవి లింగం వద్ద ఒక పళ్ళెంలో పెట్టి పూజిస్తున్నారు. సర్వాధికారి ఆజ్ఞానుసారం బ్రాహ్మణ బాలకులు ఆ పళ్ళెం తెచ్చి వారి ముందర పెట్టారు. అప్పుడు సాంబశివరావుగారు మంత్ర యుక్తంగా అభిషేకం చేస్తే, భక్తిపరులై నిరంజనానంద స్వామి ఆ పాదుకలు తుడిచి పళ్ళెంలో పెట్టారు. పూజ జరిగింది. కాషాయం ఆ పాదుకల మీద కప్పి పళ్ళెం నిరంజనానందులకు అందిస్తే అందుకుని, కళ్ళకు అద్దుకుని, ప్రసాదంగా కాషాయం గ్రహించి, ''ఇదిగో వినండి. మీ నిర్బంధం వల్ల ఈసారికి ఈ పాదుకా పూజకు అంగీకరించాను. మరెప్పుడూ ఎవ్వరూ చేయరాదు. భగవాన్ సన్నిధలో ఇలాంటివేవీ పనికిరావు'', అన్నారు చిన్నస్వామి.

శ్రీ సాంబశివరావుగారు ఒకసారి, రేపు నెల్లూరు బయలుదేరి వెళతానని శ్రీ భగవాన్‌కు విన్నవిస్తే - శ్రీస్వామి రేపు, రేపు అని నాలుగు రోజులు గడిపారు. వీరేమో తలుపు దగ్గర కూర్చొని వూరు వెడతానంటే వద్దు, వద్దు అంటున్నారని మనసులో పదేపదే అను కుంటున్నారట. అప్పుడు శ్రీ భగవాన్, ''తిట్టుకునేది నన్నేగా, పైకే తిట్టుకోవచ్చు కదా'', అని అనేసరికి వీరు తెల్లబోయారట. ఆ మరుసటి రోజున, రజాకార్ల గొడవల వల్ల రైళ్ళన్నీ గూడురులోనే

నాలుగు రోజులు ఆపారని వార్త తెలిసి, సాంబశివరావుగారు శ్రీ స్వామికి మనసులోనే క్షమాపణ వేడుకున్నారట. మనకేది మంచిదో స్వామికి తెలుసు కదా!!!

శ్రీ సాంబశివరావుగారు ఒక సందర్భంలో పెద్దగా నవ్వగా, వారి నోటి నుండి పెద్ద వెలుగు వచ్చింది. అక్కడ ప్రత్యక్షంగా ఉన్న నేను, ఇతర కుటుంబ సభ్యులందరం చూశాము. వారి సాధనకు, భక్తికి నిదర్శనం.

1962వ సం॥లో నవంబరులో వారి నిర్యాణానికి ముందు పెండింగులో ఉన్న ఒక ఆశ్రమ కేసు, ఆశ్రమానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని ఇంట్లో అందరికి చెప్పి ఎంతో సంతోషించారు. 5వ తేదీ కార్తీక శుద్ధ అష్టమి తిథి నాడు, శ్రీసాంబశివరావుగారు ధర్మపత్ని శ్రీమతి పద్మావతమ్మగారి అబ్దీకము. అప్పటికే వారి అంత్య సమయం ఆసన్నమైనను, అబ్దీకము పూర్తి అయ్యేవరకు వేచి ఉండి - అబ్దీకము పూర్తి అయినదా? అందరి భోజనాలు అయ్యాయా? అని అడిగి, ప్రసాదం నాలుకకు రాయించుకుని, అప్పుడు వారు ప్రశాంతంగా (ప్రాణాలు విడిచిపెట్టారు) శ్రీ భగవానుల పాదపద్మాలలో లీనమయ్యారు.

వారి చివరి శ్వాస వరకు శ్రీ భగవానుల స్మరణయే ఊపిరిగా జీవించారు.

## **Money, Work and Happiness**
## **(Talk 85)**

Dr. K. Subrahmanian

Some of you may like to know the meaning of the verse we recite at the end of our *satsang*. It is a *sloka* that is recited at the end of all functions. After doing *puja, japa, dhyana*, performing a wedding ceremony or a *shraadham*, the last verse is very often,

*na karmanaa na prajayaa dhanena tyagenaike amrutatva maanasuh*

Why is it recited? What does it mean? We all want to live permanently in this world, but we cannot. The body will drop away one day or the other. Whenever we remember great people for their great achievements - books, speeches, great sacrifices - we feel we should also be as great as those people. Every human being wants to be considered great in some way or the other. We would like to be remembered by posterity. We want immortality, *amrutattvam*. This is a human failing, a weakness which most people have. Some become famous, and some don't. We think that we can become immortal in one way or the other. But who are the people whom we actually remember? There must have been so many rich people, great kings, etc. We don't remember all of them. In this *sloka* it says, a few people attain immortality, *amrutattva*. Why?

*na karmanaa na prajayaa dhanena*

They attained immortality, not by getting wealth (*dhanena)*, not by doing any kind of work (*karmana*), or

through children (*prajayaa*). They became famous and attained immortality through their sacrifice, *tyaga*.

*tyagenaike amrutatva maanasuh*

They did not attain immortality through *bhoga*, but by *tyaga*, that is, renunciation. We think that by doing things, we will be rewarded; and that by doing a variety of things, we will become immortal. This verse says that it is not by doing work that we become immortal.

Almost everybody wants to work, nobody wants to remain quiet. We always criticize a person who is idle; he is one who doesn't do what he is expected to. We want him to do some work, but he goes and sees a movie instead. He is wasting his time; we would like him to spend his time usefully by doing things that we would like him to do. We expect an ordinary person to earn his livelihood. We don't want him to depend on other people for his livelihood. When he takes our money, or his parents' money, and then lives the way he wants to live, we say he is an idle fellow. It is not that he is not doing anything; he is not doing the kind of things that we want him to. According to us, his life is not fruitful. When a person does not do the kind of work that you and I do, we say that he is a lazy fellow and is wasting his time. This is the attitude of people all over the world.

In fact, this would be our attitude to a *jnani* if we didn't understand him. We would say a *jnani* is wasting his time. Some people used to tell Bhagavan that he was wasting his time. They used to ask, "Why don't you do something? Why are you sitting in one place? You are idle, you are lazy." Do you have any idea how difficult it is to sit in one

